క్లుప్తంగా

ఆరుగురు జూదరుల అరెస్టు

కారంచేడు: మండలంలోని స్వర్ణ గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను స్థానిక ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సోమవారం ఉదయం గ్రామంలో కొష్టాల సమీపంలో కొందరు పేకాడుతున్నారని వచ్చిన సమాచారంతో తమ సిబ్బందితో దాడి చేశామన్నారు. అక్కడ పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులు, వారి వద్ద నుంచి రూ. 24,730 నగదు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని ఆయన తెలిపారు.

ఇంజినీరింగ్ విద్యార్థికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిరూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మాజీ అధ్యక్షుడు ఉటూకూరి రామకోటేశ్వరరావు సౌజన్యంతో సోమవారం అద్దంకిలోని గానుగపాలేనికి చెందిన ఇంజినీరింగ్ చదువుతున్న పేద విద్యార్థి పఠాన్ ఆఫ్రిదికి రూ. 20 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు, కార్యదర్శి అళహరిహరి ప్రసాద్, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, అద్దంకి లేవీ ప్రసాద్, చప్పిడి వీరయ్య, పువ్వాడ రామకోటేశ్వరరావు, అంజాద్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల పత్రాలు తప్పనిసరి



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ ఖాదర్‌బాషా

కారంచేడు: వాహన యజమానులు తప్పకుండా తమ వాహన పత్రాలను వెంట తెచ్చుకోవాలని ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా అన్నారు. సోమవారం ఆయన వాడరేవు–పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో మండల కేంద్రమైన కారంచేడు అంబేడ్కర్ నగర్ కాలనీ, కాలువ సెంటర్, పోలీస్‌స్టేషన్ సమీపంలో వాహన తనిఖీలను ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ద్విచక్రవాహనదారులు, ఆటోవాలాలు, కార్ల వంటి వాహనాలకు అవసరమైన అన్ని రకాల పత్రాలను వెంట తెచ్చుకోవాలన్నారు. సరైన పత్రాలు లేని వాహన యజమానులకు ఆయన జరిమానాలు విధించారు.

20న విద్యుత్ వినియోగదారుల సదస్సు

అద్దంకి: డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సదస్సును ఈ నెల 20 నిర్వహించనున్నట్లు ఈఈ మస్తాన్‌రావు సోమవారం తెలిపారు. ఈ సదస్సును డివిజన్‌లోని కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలోని అద్దంకి రోడ్డులో పక్కన గల వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి విశ్రాంత న్యాయమూర్తి ఎస్. విక్టర్ ఇమ్మానియేలు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో విద్యుత్ బిల్లులలో తేడాలు, వోల్టేజ్ సమస్యలు, ఇతర విద్యుత్ సమస్యలకు సంబంధించి దీర్ఘకాలంగా పరిష్కారం కాని విద్యుత్ సమస్యలపై వినతులు స్వీకరించి తక్షణం పరిష్కరిస్తారని చెప్పారు. కార్యక్రమానికి బాపట్ల జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ జీ ఆంజనేయులు, అధికారులు హాజరవుతారని, కావున డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఈఈ కోరారు.

వ్యవసాయ యాంత్రీకరణతో ఆదాయం పెంపు



మాట్లాడుతున్న ఏడీఏ ఎఫ్రాయిం

అద్దంకి: ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణతోనే అధిక ఆదాయం సాధ్యమని అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు బీ ఎఫ్రాయిం అన్నారు. మండలంలోని బొమ్మనంపాడు రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం ఆత్మ ప్రకాశం జిల్లా సౌజన్యంతో డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా మందుల పిచికారీలో కిసాన్ డ్రోన్‌లు విప్లవాత్మక పాత్ర పోషిస్తాయని చెప్పారు. మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ మండలం లో 5 కిసాన్ డ్రోన్లు రూ. 39.20 లక్షల రాయితీ పై అందించినట్లు తెలిపారు. డ్రోన్ పనిచేసే విధానాన్ని డ్రోగో కంపెనీ ప్రతినిధి లీలాకుమార్ వివరించారు. కార్యక్రమంలో ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు, ఏటీఎంకోట. రామిరెడ్డి, వీఏఏ జాగర్లమూడి దినేష్ సాయి, ఏఈవో కోటేశ్వరరావు, నాగులపాడు సొసైటీ అధ్యక్షుడు ఏనుగంటి వెంకట్రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



దగ్గుబాడులో సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ



వైద్య, పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ జావెద్

- డీఎంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ

దగ్గుబాడు (కారంచేడు): గ్రామాల్లో డెంగ్యూ జ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని.. బాపట్ల డీఎంహెచ్ఓ డాక్టర్ జే విజయమ్మ పేర్కొన్నారు. సోమవారం ఆమె మండలంలోని దగ్గుబాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీకి సంబంధించిన అన్ని రకాల రికార్డులను ఆమె పరిశీలించారు. పీహెచ్‌సీల్లో డెలివరీల శాతం పెంపొందించాలన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులను బట్టి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, అవసరమైన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు ఎక్కడా నమోదు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. గ్రామ పంచాయతీల సిబ్బంది సహకారంతో చెత్తా, చెదారంలు ఎక్కడా నిల్వలు లేకుండా శుభ్రం చేయించాలని సూచించారు. తాగి పడేసిన కొబ్బరి బొండాలు, టీ కప్పులు, వాడని నీటి తొట్లు, పూల కుండీలు వంటివి తొలగించుకోవాలని ప్రజల్లో చైతన్యం కల్పించాలని ఆమె సూచించారు. గ్రామంలోని లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు అంటు వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సాయిప్రియ, డిప్యూటీ డీఈఎంఓ శరత్‌బాబు, పీహెచ్ఎన్ ఖాజాబీ, ఎంపీహెచ్ఈఓ టీ సుధాకర్, హెచ్ఈ శారమ్మ, హెచ్ఎస్ మధుకిరణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే నిర్వహించాలి..

యద్దనపూడి: భారీ వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ షేక్ మహ్మద్ అఖీబ్ జావెద్ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ,పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం విరామం లేకుండా కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించాలని, గ్రామ పంచాయతీ అధికారులు పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. విషజ్వరాలు రాకుండా , దోమల లార్వా వృద్ధి చెందకుండా డ్రైనేజీలను శుభ్రపరచి నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. తాగునీటి పైపుల మరమ్మతులు చేపట్టాలని ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపరచి,క్లోరినేషన్ చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీహర్ష, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వరద ముంచెత్తుతున్నా పొలాలను పట్టించుకోరా ?

- కుందేరును పరిశీలించిన వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు రమణారెడ్డి



కుందేరులో వేసిన మట్టిరోడ్డును పరిశీలిస్తున్న రమణారెడ్డి

చీరాల రూరల్: కుందేరు కాలువ ఆక్రమణలకు గురవడం వలన పొలాల్లో నుంచి వచ్చే వరదనీరు కాలువలో పారుదల కావడంలేదని.. తద్వారా పంటలు ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు కావూరి రమణారెడ్డి అన్నారు. సోమవారం ఆయన కుందేరు కాలువను పరిశీలించి మాట్లాడారు. గతంలో కుందేరు కాలువ చాలా విస్తీర్ణంతో కూడి ఉండేదని తెలిపారు. ప్రస్తుతం ఆ కాలువ ఆక్రమణలకు గురికావడమే కాకుండా ఆ కాలువలో నీరు పారుదల లేకుండా కొందరు మట్టిరోడ్లు నిర్మించుకుని రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ప్యారీ డ్రైన్‌లో రాకపోకలు వలన రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తోటవారిపాలెం హైవే బ్రిడ్జి పక్కన మట్టికట్ట అడ్డుగా వేశారని తెలిపారు. అలానే స్టువర్టుపురం నుంచి కావూరిపాలెం వెళ్లేందుకు కుందేరుపై ఇసుక రోడ్డు నిర్మించారు. అలానే దివ్యాంగుల స్కూలు దగ్గర నుండి కావూరివారిపాలెం పొలాల్లో ఇసుక రోడ్డును అడ్డుగా నిర్మించారని, దానివలన అధిక వర్షాలు పడిన సమయాలలో వర్షపునీరు పొలాల్లో నిలిచి పొలాలు ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ఇటీవల వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి పొలాల్లోకి చేరిన వర్షపునీరు పారుదల లేకపోవడంతో వేరుశనగ, మినుము రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి కుందేరులోని ఆక్రమణలు తొలగించాలని, కుందేరులో వేసిన మట్టిరోడ్లు, ఇసుక రోడ్లు కిందుగా మురుగు నీరు పారేందుకుగాను పెద్దపెద్ద తూములు ఏర్పాటు చేయాలని అధికారులను డిమాండ్ చేశారు.

వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయం ప్రారంభం



పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్న నాయకులు

పర్చూరు(చినగంజాం): పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని పర్చూరులో సోమవారం ప్రారంభించారు. నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల పార్టీ కన్వీనర్ కఠారి అప్పారావు ఆధ్వర్యంలో నూతన భవనంలో పూజా కార్యక్రమాలను నిర్వహించి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు తమ వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి ఐక్యంగా ఉంటూ పార్టీ గెలుపు ధ్యేయంగా కృషి చేద్దాం అని అన్నారు. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత మనమీద ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు, మార్టూరు, చినగంజాం, మండల కన్వీనర్‌లు జంపని వీరయ్య చౌదరి, మున్నం నాగేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు కోట శ్రీనివాసరావు, తోకల కృష్ణమోహన్, కేవీ సుబ్బారావు, తన్నీరు సూరిబాబు, ప్రభుదాసు, జఖరయ్య,కిరణ్, ముప్పల రాంబాబు, యద్దనపూడి హరిప్రసాద్, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



కారులో నుంచి వ్యక్తులను బయటకు తీస్తున్న స్థానికులు

బల్లికురవ: ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి అదుపుతప్పి పొలాల్లోకి కారు దూసుకెళ్లింది. ఈ ఘటన సోమవారం బల్లికురవ–కొమ్మాలపాడు ఆర్ అండ్‌బీ రోడ్డులోని చెన్నుపల్లి గ్రామ సమీపంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం.. సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు గ్రామానికి చెందిన ముగ్గురు కారులో బల్లికురవ వైపు వస్తుండగా బైకును తప్పించే క్రమంలో సడన్ బ్రేకు వేయటంతో మార్జిన్‌లో నుంచి పొలాల్లోని దూసుకెళ్లింది. ఈప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. స్థానికులు కారులో నుంచి వ్యక్తులను బయటకు తీశారు. త్రుటిలో పెనుప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.

మొక్కలతో పర్యావరణ రక్షణ



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న రోటరీ ప్రతినిధులు, విద్యార్థులు

పర్చూరు(చినగంజాం): మొక్కలు పర్యావరణాన్ని కాపాడుతాయని పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ అన్నారు. మండలంలోని నాగులపాలెం బధిరుల పాఠశాల ఆవరణ, చుట్టు పక్కల ప్రాంతాలలో రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు పర్యావరణాన్ని కాపాడతాయని మానవులకు ఎంతో ఉపయోగమన్నారు. అనంతరం మొక్కలు నాటి, నాటిన మొక్కలను విద్యార్థులకు దత్తత చేశారు. మొక్కలను సంరక్షించి పెంచి పోషించే బాధ్యతలను వారికి అప్పగించారు. కార్యక్రమంలో కార్యదర్శి కోమటి ఆంజనేయులు, అసిస్టెంట్ గవర్నర్ నాగభైరు శ్రీనివాసరావు, నాగుబడి సుబ్బారావు, కొల్లా సుబ్బారావు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు శ్రీకృష్ణ కల్యాణ మహోత్సవం

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని భీమవరం గ్రామంలో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ కళ్యాణ మహోత్సవం మంగళవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భీమవరం గ్రామంలో ఆనవాయితీగా వస్తున్న శ్రీకృష్ణుని ఆరాధన మహోత్సవాలు పరిమి లక్ష్మీకాంతయ్య కుటుంబ సభ్యులు వారసత్వంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం కళ్యాణ మహోత్సవంను నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు చల్లా రామకృష్ణశాస్త్రి తెలియజేశారు. 20వ తేదీ ఉట్టి మహోత్సవ కార్యక్రమం, గ్రామోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు భక్తులందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

ఎంపీడీఓ నేతాజీకి అభినందనలు



ఎంపీడీఓ నేతాజీని సత్కరిస్తున్న కార్యాలయ సిబ్బంది

కారంచేడు: ఉత్తమ ఎంపీడీఓగా అవార్డును స్వీకరించిన కారంచేడు ఎంపీడీఓ కే నేతాజీని సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో ఘనంగా సత్కరించారు. మండల స్థాయిలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు అన్ని రకముల సంక్షేమ పథకాలు అందించడంతో పాటు, ప్రజలకు అన్ని రకాల సేవలను అందించడంలో ప్రత్యేక కృషి చేసిన ఎంపీడీఓగా స్వాతంత్ర్య దినోత్సవంలో ఉత్తమ ఎంపీడీఓ అవార్డును తీసుకున్న విషయాన్ని వక్తలు గుర్తు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రామ్మోహన్, మండల హౌసింగ్ ఏఈ షేక్ ఖాశీంసాహెబ్, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన గ్రామ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు సాగు చేస్తే చర్యలు..

మేదరమెట్ల: మండలంలోని రైతులు ఈఏడాది నల్లబర్లీ, తెల్లబర్లీ పొగాకును సాగు చేయవద్దని.. అలా చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. నల్ల, తెల్ల బర్లీ పొగాకు నారుమడులు సాగు చేపట్టరాదని జిల్లా కలెక్టర్ రైతులను ఆదేశించినట్లు ఏవో తెలిపారు.

చినగంజాం: మండలంలో పొగాకు సాగు చేసే రైతులు కలెక్టర్ ఆదేశాల మేరకు పొగాకు సాగును నిషేధిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఆర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర జిల్లాల నుంచి పొగాకు నారు తెచ్చి సాగు చేస్తే పంట ధ్వంసం తప్పదని, ప్రైవేట్ కంపెనీల అగ్రిమెంట్‌లు, ప్రలోభాలు నమ్మవద్దని ఆయన తెలిపారు.

ఉత్తమ తహసీల్దార్‌కు సత్కారం



తహసీల్దార్‌ను సత్కరిస్తున్న ఐక్యవేదిక సభ్యులు

చినగంజాం: ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించిన తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావుకు ప్రభుత్వం ఉత్తమ సేవా పురస్కారం అందజేసిందని ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవల ఉత్తమ తహసీల్దార్‌గా పురస్కారం పొందిన జీవిగుంట ప్రభాకరరావును ఐక్యవేదిక ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ ప్రభాకరరావు గతంలో పొదిలి, అద్దంకి, మద్రిపూడి, చీరాల, పర్చూరు ప్రాంతాలలో తహసీల్దార్‌గా ఉత్తమ సేవలను అందించి ప్రజల ఆదారాభిమానాలను సొంతం చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీస్ ఐక్యవేదిక ఉపాధ్యక్షులు తెలగతోటి రాధాకృష్ణమూర్తి, సభ్యులు జ్యోతి డేవిడ్, జైభీమ్ చంటి బాబు, కొమ్మాలపాటి బుజ్జి,శాంతారావు, పాల్గొన్నారు.

ఆగని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం

- అవగాహన లేమితో వినియోగదారుల్లోకి చేరని వైనం
- పట్టించుకోని అధికారులు



సింగిల్ యూజ్‌ప్లాస్టిక్ సంచులు

అద్దంకి: సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం ప్రకటనలకే పరిమితం అయింది. గత నెల 19 నుంచి జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధిస్తున్నామని కలెక్టర్ ప్రకటించినా, ఆ తరువాత చర్యలు లేకపోవడంతో వినియోగదారులు, వ్యాపారులు తేలికగా తీసుకున్నారు. ఆ మరుసటి రోజు నుంచే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం యథేచ్ఛగా జరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు దుకాణాల్లో తనిఖీలతో పాటు ప్రజలకు గ్రామస్థాయి నుంచి అవగాహన కల్పించి ప్రమాదకర సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అద్దంకిలో మాత్రమే స్వచ్ఛంద సంఘాలు ప్రత్యామ్నాయ సంచులపై అవగాహన పత్రాలు, ఉచితంగా జూట్ సంచులు పంపిణీ చేస్తున్నారు. గ్రామాల్లో మరెక్కడా అవగాహనతో పాటు, ర్యాలీలు, నిర్వహించిన పాపాన పోలేదు. దుకాణదారుడు సంచి ఇవ్వకపోతే వాగ్వివాదమో, లేకుంటే సరుకులు కొనుగోలు చేయకుండా వెళ్లడమో జరుగుతోంది. ఈ క్రమంలో అధికారులు, సామాజికవేత్తలు, స్వచ్ఛంద సంస్థల సంఘాల వారు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం గురించి, దాని అనర్థాల గురించి గ్రామస్థాయిలో, పాఠశాలలో అవగాహన కల్పిస్తేనే సింగిల్ యూజ్ మహమ్మారిని నిర్మూలించగలం.

పాలు, పెరుగు, నిత్యావసర వస్తువుల కవర్ల మాటేమిటి?

పాలు, పెరుగు నిత్యావసర వస్తువుల ప్యాకింగ్ కవర్లపై నిషేధం కనిపించడం లేదు. ప్రతి రోజూ పాలు, పెరుగు, నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసినప్పుడు వచ్చే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల విషయమై ప్రభుత్వం, ఇటు అధికారులు దృష్టి సారించకపోవడంపై పర్యావరణవేత్తలు పెదవి విరుస్తున్నారు. అధికారులు, ప్రభుత్వం వాటి గురించి ఆలోచించి తగు నిర్ణయం తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలో ఆడబిడ్డలకు రక్షణ ఏది ?



కొనిదెనలో గ్రామ, బూత్ కమిటీల ఎంపికలో మాట్లాడుతున్న కృష్ణబాబు

బల్లికురవ: అలివికాని హామీలతో అధికారాన్ని చేపట్టిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఆడబిడ్డలకు రక్షణ కల్పించటంలో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు ధ్వజమెత్తారు. సోమవారం రాత్రి మండలంలోని కొణిదెన గ్రామంలో గ్రామ, బూత్ కమిటీల ఎంపికతోపాటు బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ ప్రతి నెల ఆడబిడ్డనిధి రూ. 1500 నిధి ఏమైందని, పథకాలకు కూడా ఆంక్షలతో కోతలు విధిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హులందరికి పథకాలు అందించినట్లు గుర్తించారు. ఒక్కో కుటుంబానికి సంవత్సరానికి లక్ష పైచిలుకు లబ్ధితో ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో కక్ష సాధింపులే ధ్యేయంగా పనిచేస్తున్నారని, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకే గ్రామ బూత్ కమిటీల ఎంపికతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. గ్రామ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా గుంజి ఆంజనేయులు, షేక్ జాన్‌వలి బూత్ కమిటీ అధ్యక్ష, పాధ్యక్షులుగా జంద్రాజుపల్లి పెద దేవదాసు, కొణిదెన ఆంజనేయులు, మరో 15 మందిని కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో విష్ణువాసు, ఏ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

వంటగది నిర్మాణానికి విరాళం



వంటగది నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అధికారులు, స్థానికులు

మార్టూరు: తనకు విద్యాబుద్ధులు నేర్పిన ప్రభుత్వ పాఠశాలలో వంటగది నిర్మాణానికి కోలలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి రూ.10 లక్షల విరాళం అందించారు. గ్రామానికి చెందిన కందిమళ్ల వేణుబాబు ప్రస్తుతం అమెరికాలో వైద్య వృత్తిలో ఉంటూ ఉన్నత స్థానానికి ఎదిగారు. తాను చదువుకున్న పాఠశాల వంటగది నిర్మాణం కోసం లక్షల రూపాయలు వ్యయం అవుతుందని తెలుసుకున్న వేణుబాబు ఇటీవల పాఠశాలకు విరాళం అందజేశారు. ఈ క్రమంలో సోమవారం ఎంఈవో వస్రాం నాయక్, గ్రామ సర్పంచ్ ఎం సతీష్ కుమార్ ఆధ్వర్యంలో వంటగది నిర్మాణం కోసం భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బెజవాడ రామకృష్ణయ్య, సాదినేని హనుమంతరావు, కందిమళ్ల ఆంజనేయులు, రామకోటేశ్వరరావు, హెచ్ఎం ప్రసాద్, బాలకృష్ణ, ఉపాధ్యాయులు రవి, కందిమళ్ల వీరాస్వామి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ జావెద్

యద్దనపూడి: మండల కేంద్రమైన యద్దనపూడి బాలికల గురుకుల పాఠశాల వసతి గృహన్ని ఎంపీడీఓ షేక్ మహ్మద్ అఖీబ్ జావెద్ సోమవారం అధికారులతో కలిసి తనిఖీ చేశారు. గురుకుల పాఠశాలలో తరగతి గదుల నిర్వహణ, తాగునీటి సౌకర్యం, విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యత గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వసతి గృహల్లో శానిటేషన్ పైపులు లీకవడాన్ని గమనించి తక్షణమే మరమ్మతులు చేయాలని సూచించారు. రక్షిత మంచి నీటి పథకానికి సంబంధించి నూతన పైపులు వేసేలా ప్రతిపాదనలు తయారుచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చైతన్యకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ చిలుకూరి గోపి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జె. రాజ్యలక్ష్మి, ఈఓపీఆర్డీ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు దితరులు పాల్గొన్నారు.

దేవస్థాన చైర్మన్‌గా ఆంజనేయులు



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

వేటపాలెం: రామన్నపేట పంట శివారులో పొలాల్లో వెంచేసియున్న కనక నాగవరపమ్మ అమ్మవారి దేవస్థానం నూతన ధర్మకర్తల చైర్మన్‌గా వలేటి ఆంజనేయులు ఏన్నికైనట్లు ఆలయ ఈవో పోతిన శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు దేవస్థాన నూతన కమిటీ చేత సోమవారం దేవస్థానం ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ధర్మకర్తలుగా గోవిందు సుబ్బారావు, గుత్తి వీర ప్రసాదరావు, చప్పిడి వెంకట్రావు, ఆతిన రమేష్, యర్రా శివనాగ మల్లేశ్వరి, చుండి లక్ష్మీ, ద్రోనాదుల సుబ్బయమ్మ, కంచర్ల భిక్షాలు చేత ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొత్రపు జనార్దన్, సంతరావూరు పీఏసీఎస్ చైర్మపర్సన్ యార్లగడ్డ లక్ష్మీ, దేవతోటి సుందరావు పాల్గొన్నారు.